


## చిన్నమాట

కథ అందరికీ నచ్చే సాహిత్య ప్రక్రియ. బాల్యం నించే మనిషికి కథలంటే ప్రీతి. అందుకే తెలుగులో వార, మాసపత్రికల్లో కథలు తప్పనిసరి. ఆఖరికి ఆదివారం అనుబంధాల్లో కూడా. కథా సరిత్సాగరం, కాశీ మజలీ కథలు, పంచతంత్రం కథలు.... ప్రతి సంస్కృతికీ ఇలాంటి కథలున్నాయి. తెలుగు కథల నేపథ్యానికి విస్తృతి లేదు. ఈనాటికీ అవి ఎదగలేదు. ప్రేమ, కుటుంబం, జానపదం, హాస్యం, ఇంకా ఆఫీసు కథలు, కమ్యూనిస్ట్ కథలు, తెలుగు కథలు ఇలా కేవలం పరిమిత ఇతివృత్తాల చుట్టూనే తిరుగుతున్నాయి.

కమ్యూనిజం, స్త్రీవాదం, దళితవాదం కథలని అతి గొప్ప కథలుగా చలామణి చేసే ప్రయత్నం కొన్ని పదుల సంవత్సరాలుగా జరుగుతోంది. కథల పోటీల్లో అవార్డులుకూడా ఈ కథలకే వస్తూండడం కూడా మనం గమనించవచ్చు. ఈ మధ్య యువరచయితలనుంచీ స్వలింగ సంపర్కం లాంటి జుగుప్సాకరమైన కథలు కూడా వస్తున్నాయి.

తెలుగులో 1950-1960లలో వెలువడ్డ కథలు ఈనాటికీ గుర్తుండిపోయే మంచి కథలు. ఆనాటి రచయితలు ఏ వాదానికీ కట్టుబడకుండా మానవ జీవితాల్లోని సున్నిత అంశాలతో కథలు రాసారు.

విదేశాల్లో, ముఖ్యంగా అమెరికా, యూరప్‌లలో కథా ఇతివృత్తం ఎంతో విస్తృతమైందని వారి పత్రికలు చదివాక నాకు అర్ధమైంది. విపుల మాస పత్రిక ఆరంభించినప్పటినించి నేను వాటిని తెలుగులో అనువదిస్తున్నాను.

చిన్నప్పటినించి నాకు క్రైం కథలంటే ఇష్టం. ఆ రకం కథల ఇతివృత్తాలు కూడా ఎంతో విస్తృతమైనవి. హత్య, పరిశోధనే కాకుండా లాక్ట్ రూమ్ మిస్టరీస్, పజిల్స్, అతీంద్రియ కథలు, ట్విస్ట్ కథలు, హాస్యం, చరిత్ర, జానపద నేపథ్యం, కిడ్నాపింగ్, పగ, ప్రతీకారం, బ్లాక్ మెయిలింగ్ కథలు ఇంకా కిరాయి హంతకులు, వృద్ధులు, పిల్లలు, జంతువులు ప్రధాన పాత్రలుగాగల కథలు, రోడ్ కథలు, హృదయాన్ని స్పందింపచేసే కథలు... ఇలా వాటిలో ఎన్నో డివిజన్స్ ఉన్నాయి.

అలాంటి కథలని తెలుగు పాఠకులు ఈ నెలనించి కౌముదిలో నెలకి ఒకటి చదవగలరు. తెలుగు కథా వీధుల్లో లభ్యం కాని ఈ వినూత్న కథలు మిమ్మల్ని ఆనందింప చేస్తాయని ఆశిస్తూ ...

మీ మల్లాది వెంకట కృష్ణమూర్తి.

(ప్రారంభం)

## దేశం లేని మనిషి

*రచన: ఎడ్వర్డ్ ఎవరెట్ హేల్*

**యునైటెడ్ స్టేట్స్ ఆర్మీలో** ఫిలిప్ లెఫ్టినెంట్‌గా పనిచేస్తున్నాడు. 1805లో మేమిద్దరం మంచి మిత్రులయ్యాం. అతనితో నాకు ఎన్నో జ్ఞాపకాలు ఉన్నాయి. అతనికి నేను ఒక్కడ్నే ఏకైక మిత్రుడ్ని. రీజియన్ ఆఫ్ ది వెస్ట్‌లో ఫిలిఫ్, నేను ఒకే ఆర్మీ కేంప్‌లో ఉన్నప్పుడు అతను చాలా బాధని అనుభవించాడు. అది చాలా అమాయకంగా ఆరంభమైందనే చెప్పాలి. అప్పుడు అతని వయసు సుమారు ఇరవై ఏళ్ళు.

ఓ రోజు సాయంత్రం నేను, ఫిలిఫ్ బేరక్స్‌లో నడుస్తూండగా అతను ఎక్సయిటింగ్‌గా ఆరన్ గురించి చెప్పాడు.

"ఆరన్ యునైటెడ్ స్టేట్స్ నించి విడిపోయి మెక్సికో మీద దాడి చేయబోతున్నాడు. ఆరన్ వెంట నరకం దాకా వెళ్ళడానికి వేలమంది ఉన్నారు. నేను కూడా అతని సైన్యంలో చేరాలని అనుకుంటున్నాను. నాకు అందులో కాంటాక్ట్ దొరికింది. కొన్ని వారాలుగా మా మధ్య ఉత్తరప్రత్యుత్తరాలు జరుగుతున్నాయి. దీన్ని ఎవరితో చెప్పద్దని నన్ను కోరాడు."

"ఒద్దు. అది ప్రమాదం" సలహా ఇచ్చాను.

ఆ రాత్రి అతను బేరక్స్ నించి రహస్యంగా ఆరన్ దగ్గరకి వెళ్ళాడు. తను జీవన్మరణాన్ని పొందబోతున్నానని ఫిలిఫ్‌కి అప్పుడు తెలీదు. వారం తర్వాత అతను ఆర్మీనించి పారిపోయి ఆరన్ సైన్యంలో చేరాడు. ఆరన్ వ్యూహం ఏమిటో నాకు తెలీదు. నిజానికి ఎవరికీ తెలీదనుకుంటాను.

ఆరన్ సైన్యంలోని అందరినీ యు ఎస్ మిలటరీ పోలీసులు అరెస్ట్ చేసారని నాకోరోజు తెలిసింది. కానీ ఆరన్, ఇతర పెద్ద తలకాయలు మాత్రం తప్పించుకున్నారు. మిగిలిన వారిని దేశద్రోహ నేరం కింద విచారణ జరిపారు. ఫిలిప్‌ని కూడా విచారించారు. మిలటరీ కోర్ట్‌లో కల్నల్ మోర్గాన్ విచారణ జరిపాడు. ఫిల్‌ప్‌కి వ్యతిరేకంగా చాలా సాక్ష్యాలు దొరికాయి. కల్నల్ మోర్గాన్‌కి, ఫిలిప్‌కి జరిగిన ప్రశ్నోత్తరాలని తర్వాత చదివాను. ఆయన ఇలా ప్రశ్నించాడు.

"ఫిలిప్. ఆరన్ ఆజ్ఞాపిస్తే నువ్వు ఎక్కడికైనా వెళ్ళి ఎవరితోనైనా యుద్ధానికి సిద్ధపడ్డావా? నీ స్వదేశమైన యునైటెడ్ స్టేట్స్ మీదకి కూడా నువ్వు యుద్దానికి రావడానికి సిద్దపడ్డావా? ఒకవేళ నువ్వు యు.ఎస్.ఏ కి విధేయతగా ఉంటే అది ఋజువు చేయగలవా?"

"డేమ్ ది యునైటెడ్ స్టేట్స్" ఫిలిప్ కోపంగా అరిచాడు.

ఫిలిప్‌ది కోర్ట్‌లో తనేం చెప్తున్నాడో అర్థం చేసుకోలేని లేత వయసు.

ఆ మాటలు విన్న కల్నల్ మోర్గాన్ మొహం వెంటనే తెల్లబడింది. అతను మిగిలిన వారితో తన ఛాంబర్లోకి వెళ్ళి పావుగంటలో తిరిగి వచ్చాడు. అతని వంక ఫిలిప్ నిరసనగా చూసాడు. మోర్గాన్ తన తీర్పుని ఇలా చెప్పాడు.

"అమెరికా అధ్యక్షుడు థామస్ జెఫర్సన్ అంగీకరిస్తే నువ్వెప్పుడూ యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా పేరు ఇక వినకూడదు."

బదులుగా ఫిలిప్ పగలబడి నవ్వాడు.

"నేను మళ్ళీ అదే మాటంటాను కల్నల్. డేమ్ ది యునైటెడ్ స్టేట్స్. డేమ్ ది యునైటెడ్ స్టేట్స్."

తీర్పు ప్రకారం ఫిలిప్‌ని నటిలిస్ అనే యునైటెడ్ స్టేట్స్ నేవీ సాయుధ పడవలో న్యూ ఆర్లియెన్స్‌కి తీసుకెళ్ళారు. అక్కడ అతన్ని నార్త్ ఈస్ట్ నేవీ డివిజన్‌కి చెందిన కల్నల్ షాకి అప్పగించారు. ఎవరూ ఫిలిప్ సమక్షంలో యునైటెడ్ స్టేట్స్ పేరుని ఉచ్చరించకూడదన్న తీర్పు కాగితాన్ని కూడా కెప్టెన్ షాకి పంపారు.

"నీకు పడ్డ శిక్ష తెలుసుగా? నువ్వు దేశం లేని మనిషివి మిస్టర్ ఫిలిప్." కెప్టెన్ షా చెప్పాడు.

"దేశం లేని మనిషా? అంటే?" ఫిలిప్ ప్రశ్నించాడు.

"కోర్ట్ నీ కోరికని తీర్చింది. నువ్వింక ఎప్పుడూ నువ్వు పుట్టిన ఆ దేశంలోకి వెళ్ళలేవు. ఆ దేశం పేరు కూడా నువ్వింక ఎప్పుడూ వినవు. నీ జీవితకాలం నువ్వు ఈ ఓడలోనే జీవిస్తావు. ఇది నీ మాజీ దేశం ఇచ్చిన తీర్పుగా భావించు. నువ్వు ఈ ఓడలోంచి తప్పించుకోలేవు. గట్టి కాపలా ఉంటుంది. కానీ ఓడలో మాత్రం నువ్వు స్వేచ్ఛగా తిరగచ్చు. నిన్ను ఏ విధంగా అగౌరవపరచం."

అలా ఫిలిఫ్ సప్తసముద్రాల మీద ప్రయాణిస్తూ, ఆ ఓడలో జీవించసాగాడు. ఓడ ఏదైనా రేవులో ఆగినప్పుడు అతను ఓడదాటి నేలమీదకి వెళ్ళకుండా గట్టి కాపలా ఉండేది. ఆ ఓడని ఓసారి ఓవర్ హాల్‌కి అమెరికాకి తీసుకెళ్ళేప్పుడు అతన్ని మరో ఓడలోకి మార్చారు. ఇలా ఫిలిప్ అనేకసార్లు చాలా ఓడలు మారాడు.

పదేళ్ళ తర్వాత తిరిగి అతను ఇంగ్లండ్‌కి వెళ్ళే నోటులస్ ఓడలో ప్రయాణిస్తూండగా, స్పెషల్ రీసెర్చ్‌కి నేను కూడా ఆ ఓడలో ప్రయాణించడం సంభవించింది. మొదటిరోజు కెప్టెన్ నన్ను పిలిచి అడిగాడు.

"ఫిలిప్ ఈ ఓడలో ఉన్నాడని నీకు తెలుసుగా?"

"తెలుసు."

"మీ ఇద్దరూ మంచి మిత్రులు అనుకుంటాను?"

"అవును. వెస్టన్ రీజియన్‌లో మేం ఇద్దరం కలిసి పని చేసాం. తీర్పు గురించి కూడా తెలుసు. ఇంకా ఆ నిశ్శబ్దాన్ని అనుసరిస్తున్నారా?" ప్రశ్నించాను.

"అవును. నా ఓడలో మీరు ఉన్నంతకాలం ఫిలిప్ ముందు యునైటెడ్ స్టేట్స్ అనే పేరుని ఉపయోగించద్దని, అది నేరమని చెప్పడానికి పిలిచాను. మీ పాత రోజులు, అమెరికాకి సంబంధించిన ఏ వార్తలూ అతని చెప్పకూడదు. థాంక్స్. ఇక మీరు వెళ్ళచ్చు."

నేను ఫిలిప్‌ని చూసి నిర్ఘాంతపోయాను. అతన్ని గుర్తుపట్టడానికి కొంత సమయం పట్టింది. బాగా మారిపోయాడు. ముప్పై రెండేళ్ళ అతను అరవై పైబడ్డ వృద్ధుడిలా కనిపించాడు. అతను నా వంక కొన్ని క్షణాలు చూసి ఆనందంగా అరిచాడు.

"హలో.. నిన్ను చాలాకాలం తర్వాత చూడటం ఆనందంగా ఉంది. నీ పేరు మర్చిపోయాను."

"అవును. నిన్ను చూసి పదేళ్ళు దాటింది" చెప్పాను.

"ఈ పదేళ్ళనించి ఏం చేస్తున్నావు?" ఫిలిప్ అడిగాడు.

"ప్రయాణాలు. ఇంగ్లండ్‌లో కొంతకాలం ఉన్నాను. నువ్వు నీ సమయాన్ని ఎలా గడుపుతున్నావు?" అడిగాను.

"చాలా పుస్తకాలు చదివాను. కాని ఆ పుస్తకాల్లోని కొన్ని పదాల మీద నల్లరంగు పూసో, చింపేసో సెన్సార్ చేసి ఇస్తున్నారు. నావికుల నించి నాకు తెలీని విషయాలు నేర్చుకుంటున్నాను. నాకు ఇంటి మీదకి మనసు మళ్ళింది. మళ్ళీ నా ఇంటిని, నా వాళ్ళని చూడాలన్న కోరిక తీవ్రంగా ఉంది. నేను పుట్టిన దేశం మట్టిని స్పర్శిచాలని ఉంది. మెక్సికో, ఆరన్‌ల గురించి ఏం జరిగిందో తెలుసుకోవాలని కూడా ఉంది. పదేళ్ళ క్రితం నేనో అమాయక వెధవని. అప్పట్లో నాకు నేనేం చేస్తున్నానో తెలుసుకునే ఆలోచనా శక్తి లేదు" చెప్పాడు.

"ఐ యాం సారీ. నిన్ను మళ్ళీ కలుస్తాను" చెప్పాను.

ప్రతీ సాయంత్రం నాలుగుకి ఫిలిప్ నావికులకి తను రాసిన ఓ పుస్తకం చదివి వినిపిస్తూంటాడు. ఆ రోజు అతను చదివింది నేను కూడా విన్నాను. దాని సారం ఈ లోకంలో ఎవరైనా తన ఇంటికి దూరమై, విదేశీ భూమిలో నివశిస్తూంటే, అతని హృదయం మాత్రం స్వదేశంలో ఉంటే, వెళ్ళి అతనికి చెప్పండి. అతను భూమి మీదే నరకాన్ని అనుభవించాడు కనుక అతన్ని దేవతలు నరకానికి కాక స్వర్గానికి తీసుకెళ్తారని."

అది చదువుతూంటే అతని కళ్ళల్లోంచి కారే నీటిని అంతా చూసారు.

"సారీ. ఇక ఈ రోజు చదవలేను" చెప్పి ఫిలిప్ ఆ గదిలోంచి బయటకి నడిచాడు.

ఆ తర్వాత రెండు రోజులు అతను తన కేబిన్ తలుపు తెరచుకుని బయటకి రాలేదు. అతని ప్రైవసీకి భంగం కలిగించకూడదని నేను కూడా వెళ్ళలేదు. కెప్టెన్ జాన్ చెప్పాడు.

"ఫిలిప్ ఎవర్నీ తన కేబిన్‌లోకి అనుమతించడు. కారణం తెలీదు. మేం కూడా అందులోకి వెళ్ళం. తన కేబిన్‌లో అతనేం చేస్తున్నాడన్నది అతనిష్టం. కొందరు కొంత ఊహాగానం చేసారు" నవ్వాడు.

"ఏమని?" ఆసక్తిగా ప్రశ్నించాను.

ఊడూ ప్రాక్టీస్ చేస్తూంటాడని."

"మర్నాడు ఓ స్కూనర్‌ని మా ఓడ గమనించింది. డెక్ మీది వారిని చూసాక దాంట్లో నల్ల బానిసలు ఉన్నారని మాకు అర్థమైంది. వెంటనే కెప్టెన్ ఓ ఆఫీసర్ని, ఆరుగురు సైనికులని అందులోకి ఇన్‌స్పెక్షన్ కోసం పంపాడు. వారు తిరిగి వచ్చేదాకా డెక్ మీద అంతా వేచి చూడసాగాం. ఫిలిప్ కూడా మా దగ్గరకి వచ్చాడు. ఆ ఓడలోకి వెళ్ళిన ఆఫీసర్ హాన్ వచ్చి చెప్పాడు.

"నాకు వారి భాష అర్థం కావడంలేదు. ఆ స్కూనర్లోని అంతా మాట్లాడే భాష పోర్చుగీస్ అని నా అనుమానం."

"కాని మన మెరైన్‌లో పోర్చుగీస్ తెలిసినవారు ఎవరూ లేరు" కెప్టెన్ జాన్ చెప్పాడు.

"నేనా భాష మాట్లాడగలను. ఈ పదేళ్ళలో ఓడల్లో నేను చాలా నేర్చుకున్నాను" ఫిలిప్ మెల్లిగా చెప్పాడు.

అరగంటలో స్కూనర్ని స్వాధీనం చేసుకున్నాం. దాన్ని నడిపే వాళ్ళు ముగ్గురు మాత్రమే ఉన్నారు. ఫిలిప్ కాళ్ళకి, చేతులకి వేసిన సంకెళ్ళని తొలగించి లైఫ్ బోట్లో స్కూనర్ మీదకి తీసుకెళ్ళారు. బానిసలని బంధించిన భాగంలో కిందంతా మలమూత్రాల దుర్గంధంతో నిండి ఉంది. వారి కాళ్ళకి, చేతులకి కూడా వేసిన ఇనప సంకెళ్ళని విప్పుతీయగానే నల్ల బానిసలు ఆనందంగా డెక్ మీదకి పరిగెత్తుకు రాసాగారు. వారంతా గబగబా మాట్లాడసాగారు. వారి కెప్టెన్‌ని పిలిచి జాన్ అడిగాడు.

"నువ్వు యునైటెడ్" తమాయించుకుని ఆగి ఇలా కొనసాగించాడు" మా దేశ నియమాలని అతిక్రమించి మా సముద్రజలాల్లో బానిసల రవాణా చేస్తున్నావని తెలుసా?"

ఆ మాటలని దుబాసీగా వ్యవహరించే ఫిలిప్ పోర్చుగీస్ భాషలోకి అనువదించి చెప్పి, అతని సమాధానాన్ని కెప్టెన్ జాన్‌కి ఇంగ్లీష్‌లో చెప్పాడు.

"లేదు తనకి అది తెలీదట."

"కెప్టెన్‌కి చెప్పు, అతను ఆఫ్రికన్స్‌ని బానిసలుగా రవాణా చేయడం నేరమని. వాళ్ళకి సంకెళ్ళు వేయడం వల్ల అది ఋజువవుతోందని కూడా చెప్పు. తాడుతో ఉరికంబం సిద్దం చేయగానే అతన్ని ఉరి తీస్తామని కూడా చెప్పు."

ఫిలిప్ అది చెప్పగానే బానిసలంతా ఆనందంగా అరిచారు. వాళ్ళు చెప్పింది విని ఫిలిప్ తర్జుమా చేసాడు.

"బానిసలంతా తిరిగి తమ స్వదేశానికి వెళ్ళాలంటున్నారు. తమ ఇళ్ళనీ, తమ కుటుంబాలనీ చూడాలని అనుకుంటున్నారు. పిల్లలు.. తమ పిల్లలకి ఒంట్లో బాలేక డాక్టర్ దగ్గరకి వెళ్తూంటే వీళ్ళ మనుషులు తనని కిడ్నాప్ చేసారని ఒకరు చెప్పారు. అంతా ఇళ్ళకి వెళ్ళాలని అనుకుంటున్నారు" ఫిలిప్ బాధతో వణికే కంఠంతో చెప్పాడు.

"తప్పకుండా. వీళ్ళందరినీ ఇళ్ళకి పంపుతామని చెప్పు" కెప్టెన్ జాన్ వాళ్ళ వంక సానుభూతిగా చూస్తూ చెప్పాడు.

వాళ్ళల్లోని కొందరు తమకి దుబాసీగా వ్యవహరించి సహాయం చేసిన ఫిలిప్ మొహంలోని గాఢమైన విషాదాన్ని, భావాలని, అతని చూపులని అర్ధం చేసుకోగలిగారు.

మా ఓడ ఇంగ్లండ్ నించి న్యూయార్క్ చేరుకుంది. నేను ఓడ దిగాక డెక్ మీద నిలబడి నాకు చేతులూపే ఫిలిప్‌ని ఆఖరిసారి చూసాను.

ప్రయాణాల్లో అతను చేసిన నిస్వార్ధ సేవ గురించి క్రమంగా నాకు తెలిసింది. ఆసక్తితో ఆ ఓడ కెప్టెన్స్‌ని కలిసి నేనా వివరాలని తెలుసుకున్నాను.

ఓ రోజు ఉదయం నాకో ఉత్తరం వచ్చింది. నేను ఫిలిప్‌ని చూసిన నలభై ఏళ్ళ తర్వాత. అది ఓ ఓడ కెప్టెన్ నించి వచ్చింది దాన్ని తెరచి చదివాను.

***డియర్ సర్,***

ఈ ఉదయం ఫిలిప్ నోలన్ మరణించాడు. అతను తన కేబిన్‌లోకి ఎవర్నీ అనుమతించేవాడు కాదని మీకు తెలుసు. నిన్న రాత్రి ఫిలిప్ నన్ను చూడాలనుకుంటున్నాడని, తన కేబిన్‌కి రమ్మని కబురు చేయడంతో నేను అతని కేబిన్‌లోకి వెళ్ళాను. మొదటిసారి ఆ కేబిన్‌ని చూసాను. అందులో ఏం ఉందో ఊహించగలరా?

అమెరికాకి దేవాలయం. ఓ గోడకి పెద్ద అమెరికన్ జెండా. వాషింగ్టన్ ఫోటో. ఇత్తడితో చేసిన ఓ పెద్ద ఈగిల్ విగ్రహం.

"నేను మరణించబోతున్నానని నాకు తెలుసు ఇన్ని సంవత్సరాలు నేను స్వదేశం లేని మనిషిగా జీవించాను. కానీ నా మనసులో మాత్రం నా స్వదేశమైన యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా ఉంది. ఇది మీరు ఎవరికైనా చెప్పచ్చు. అమెరికన్ మేప్‌ని చూడండి. నేను అది నా జ్ఞాపకాల్లోంచి గీసాను. 'నేను పుట్టిన మిసిసిపీ టెరిటరీ ఇంకా మిసిసిపీ టెరిటోరీయేనా?" అని అడిగాడు. 'లేదు. ఇప్పుడు మిసిసిపీ ఓ రాష్ట్రంగా మారింది ఫిలిప్' అని చెప్పాను.

'నన్ను అమెరికా బహిష్కరించినప్పుడు ఇరవై రాష్ట్రాలుండేవి. ఇప్పుడు?' మళ్ళీ అడిగాడు. 'ముప్పైనాలుగు' జవాబు చెప్పాను. 'మిగిలిన పధ్నాలుగు ఎక్కడివి? పాత వాటిని చీల్చారా?' అని అడిగితే, 'లేదు, ఐయోవా, ఇల్లినాయి, లూజియానా మొదలైనవి వచ్చి చేరాయి' అని చెప్పాను. 'టెక్సస్? టెక్సస్ మాటేమిటి?' కొద్ది క్షణాల తర్వాత అడిగాడు. 'అది కూడా ఇప్పుడు అమెరికాలో చేరింది' 'వండ్రఫుల్. నేను అమెరికన్‌ని. నేను అమెరికన్‌ని. నేను అమెరికన్‌ని' అతను ఏడుస్తూ చెప్పాడు. తనకి ఇచ్చిన వేలాది పుస్తకాల్లో కేవలం ఒకే పుస్తకంలో యునైటెడ్ స్టేట్స్ అనే పదం మీద నల్లరంగు పూయబడలేదని, ఆ పదాన్ని తమ ప్రార్ధనలా నిత్యం కొన్ని వేలసార్లు చదివానని అతను చెప్పినప్పుడు నా కళ్ళు కూడా చెమ్మగిల్లాయి.

"నువ్వు ఉత్త అమెరికన్‌వి కావు ఫిలిప్. మంచి అమెరికన్‌వి. చాలామంది కన్నా' అని చెప్పాను. 'థాంక్యూ. థాంక్యూ'

అతని ఆఖరి కోరిక తన సమాధి రాయిని యునైటెడ్ స్టేట్స్‌లో తన రాష్ట్రం మిసిసిపిలో ఎక్కడైనా పాతడం. మీ పేరు చెప్పి మిమ్మల్ని ఈ సహాయం కోరమని అర్థించాడు. తీర్పు ప్రకారం సముద్రంలో జలసమాధి చెందిన ఫిలిప్ నోలన్ పేర అతను ప్రేమించే యునైటెడ్ స్టేట్స్‌లో ఎక్కడైనా అతని సమాధి రాయిని పాతగలరా?

**సిన్సియర్లీ యువర్స్**

**రిచర్డ్ వాన్**

మిసిసిపీలోని ఫోర్ట్ ఆడమ్స్‌లో ఇప్పుడు ఫిలిప్ సమాధిరాయి ఉంది. దానిమీద ఇలా రాసుంది.

'ఫిలిప్ నోలన్ జ్ఞాపకార్థం. లెఫ్టినెంట్, యునైటెడ్ సేట్స్ ఆర్మీ. అతను తన దేశాన్ని మరెవరూ ప్రేమించనంతగా ప్రేమించాడు. అలాగే అమెరికా చేతుల్లో ఇతను పొందినలాంటి శిక్ష మరెవరూ పొందలేదు'

(ఈ కథ డిసెంబర్‌లో 1863 'ది అట్లాంటిక్' అనే అమెరికన్ మాసపత్రికలో తొలిసారిగా ప్రచురితమైంది. తర్వాత మొత్తం నాలుగుసార్లు (1917, 1918, 1925, 1937 సంవత్సరాల్లో) దీన్ని సినిమాగా తీసారు 1943లో రేడియో డ్రామాగా కూడా ప్రసారమైంది.)

**(వచ్చేనెల మరోకథ)**

Post your comments